ప్రెస్ రిలీజ్ తేది.17-12-2020

వైకల్యం శరీరానికే కానీ ఆత్మకు కాదని, దివ్యాంగులు ఆత్మ విశ్వాసంతో ఎన్నో విజయాలను సాధిస్తున్నారని, వారి విజయాలను అందరూ స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలని జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.శరత్ అన్నారు.

బిఎస్ఎఫ్ వారి సహకారంతో ఆదిత్య మెహతా ఫౌండేషన్‌కు చెందిన 30 మంది దివ్యాంగ సైకిలిస్టులు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సైకిలింగ్ చేస్తూ మార్గమధ్యలో కామారెడ్డికి చేరుకున్నారు. వారికి గురువారం జనహిత భవన్‌లో జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.శరత్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎన్.శ్వేత హృదయపూర్వక అభినందలతో స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా జనహిత భవన్‌లో ఆదిత్య మెహతా ఫౌండేషన్ ద్వారా జిల్లా దివ్యాంగ సంక్షేమం సంఘ సభ్యులకు నిర్వహించిన అవగాహన, ప్రేరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఆదిత్య మెహతా ఫౌండేషన్ వారు దివ్యాంగుల మనోస్థైర్యానికి చేస్తున్న కార్యక్రమాల పట్ల అభినందలు తెలిపారు. ఆదిత్య ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు వీల్‌చైర్స్, కృత్రిమ అవయవాలు, పరికరాలు అందించి, వారికి జీవితం పట్ల మనోధైర్యం కల్పించి 28 క్రీడలలో ఉచితంగా శిక్షణ అందించడం గొప్ప మానవతా దృక్పథమని అన్నారు. జిల్లాకు చెందిన దివ్యాంగులు కూడా ఆదిత్య పౌండేషన్ వారి సేవలను పొందాలని అన్నారు. శరీరంలో ఒక అవయవం లేకపోయినా ఆత్మ ఉంటుందని, ఆత్మతోనే తన మీద తనకు విశ్వాసం కలిగించుకోవాలని, ఇతరుల జీవితాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని విజయాలు సాధించాలని అన్నారు. అరుణిమా సిన్హా అనే అమ్మాయి ఒక రైలులో ప్రయాణంలో రైలును దొంగలు దోచుకుంటున్నప్పుడు ఆమె ప్రతిఘటిస్తుంటే జరిగిన ప్రమాదంలో ఆమె రైలు క్రింద పడిపోయి కాళ్లను పోగొట్టుకుందని, రైలు ట్రాక్ మధ్యలో ఆమె పడినప్పుడు ఆమె మీదుగా రైలు వెళ్లడం జరిగిందని, ఆ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లను పోగొట్టుకొని కూడా ఆత్మ విశ్వాసాన్ని పోగొట్టుకోలేదని, జీవితంలో ఏదైనా ఒకటి సాధించాలనే మనోనిబ్బరంతో ఆమె 8848 అడుగుల శిఖరాన్ని అధిరోహించి మన భారతీయ జెండా ఎగురవేసిందని, ఇలాంటి వారి నుండి స్ఫూర్తి పొంది విజయాల సాధనకు కృషి చేయాలని, ఆదిత్య ఫౌండేషన్ వారికి జిల్లా యంత్రాంగం నుండి అన్ని సహాయ సహకారాలు అందిస్తామని, వారు జిల్లాలోని దివ్యాంగులకు శిక్షణ, ప్రేరణ అందించాలని కోరారు.

జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఎన్.శ్వేత మాట్లాడుతూ, ఆదిత్య మెహతా ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులందరికి మెసేజ్ వెళ్లాలని, దివ్యాంగులకు, ప్రత్యేకంగా పిల్లలకు స్ఫూర్తి కలిగించి దేశం గర్వించే స్థాయిలో వారికి శిక్షణ అందించాలని కోరారు. మన జిల్లా నుండి పిన్న వయస్సులోనే ఎవరెస్టుఅధిరోహించిన మలావత్ పూర్ణ విజయం అందరికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్యారా ఒలింపిక్స్‌కు వెళ్లి పతకాలు సాధించే సత్తా మీలో వుందని, సాధించాలని అన్నారు.

ఆదిత్య మెహతా ఫౌండేషన్ కమ్యూనికేషన్ డైరెక్టరు ఇందిర ఫౌండేషన్ కార్యక్రమాలను వివరించారు. 35 మంది దివ్యాంగ సైకిలిస్టులతో గత నవంబరు 9 నుండి డిసెంబరు 31 వరకు మొత్తం 3842 కి.మీ.లకు గాను ఈ రోజు వరకు 2500 కి.మీ.ల ప్రయాణం చేయడం జరిగిందని, ప్రయాణ మధ్యలో అనేక స్కూల్స్‌లో మోటివేషన్, ట్రైనింగ్ ప్రోగ్రాములు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా 200 మందికి కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ అందించడం జరిగిందని తెలిపారు. 14 సంవత్సరముల నుండి 60 సం.ల వరకు వయస్సు కలిగి ఆసక్తి కలిగిన దివ్యాంగులు హైదరాబాదులోని ఆదిత్య మెహతా అకాడమిలో చేరవచ్చునని, అక్కడే ఉచిత పునరావాస ఏర్పాటు, శిక్షణ అందించడం జరుగుతుందని, ఆసక్తి గల వారు www.adityamehtafoundation.org.hyd ద్వారా సంప్రదించవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్ క్లాసుల ద్వారా కూడా ఫిట్‌నెస్ క్లాసులు నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు.

అంతకు ముందు సైకిలిస్టులు హర్షద్, గుర్విందర్ మాట్లాడుతూ, తమకు అవయవ లోపం వున్నా క్రీడలలో ఉత్సాహంగా పాల్గొని రాణిస్తున్నామని, పతకాలు కూడా సాధిస్తున్నామని అన్నారు. ఎలాంటి ఆధారం లేని దివ్యాంగులకు ఆదిత్య మెహతా ఫౌండేషన్ వారు సపోర్ట్ చేస్తూ వారిలో వున్న నైపుణ్యాలను వెలికితీస్తున్నారని, ఆత్మ విశ్వాసాన్ని నింపుతున్నారని తెలిపారు.

కార్యక్రమంలో బార్డర్ సెక్యూరిటీ కమాండెంట్ మనోజ్ పెన్యూలీ, బార్డర్ సెక్యూరిటీ సిబ్బంది, జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ సంక్షేమ అధికారి అనూరాధ, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు దుర్గాప్రసాద్, దివ్యాంగులు పాల్గొన్నారు.

-------------------------*జిల్లా పౌర సంబంధాల అధికారి, కామారెడ్డి గారిచే జారీ చేయనైనది.*